స్కెచ్

# కనబడినవీ — వినబడినవీ

వాసిరెడ్డి కోటీశ్వరరావు

ఇల్లంతా నిశ్శబ్దంగావుంది. అలాగే గోడకేసి చూస్తున్నా యీజీఛైర్‌లో పరుండి. రకరకాల ఫొటోలయితే వున్నాయి గోడనిండా. నా కళ్లు మాత్రం శ్రీమతి ఫొటోనే వెతుకుతున్నాయి. నేను ఒక్కరోజు లేకపోయినా ఎంతో ఆరాట పడేది. ఎప్పుడొస్తానా అని వేయికన్నులతో నిరీక్షిస్తూ వుండేది. ఆమెను చూడకుండా ఒక్క రోజుకూడా వుండలేక పోయేవాడిని. ఈ నెల రోజులనుంచి ఈ శూన్యగృహంలో ఒంటరి జీవితాన్ని ఎలా గడుపుతున్నానో నాకు మాత్రం తెలియదు.

అప్పుడే గడియారం టంగ్‌టంగ్ టంగ్ మంటూ మూడు కొట్టింది. నిజంగా నామాదిరే ఆ గడియారానికికూడా కాలం గడవనట్లుంది. ఎండకూడ తీవ్రంగావుంది. అలాగే బజారు కని బయలు దేరాను ఏ వుద్దేశం లేకుండానే.

అదే దారిని యింతవరకు అంటే ఈ బస్తీకి వచ్చినప్పటినుంచి శతపర్యాయాలైనా నడచి వుంటాను. కాని ఈనాడేమిటో అంతా కొత్తగా వుంది.

పదిగజాలు నడిచానో లేదో చెడుకంపు. తిన్నది కూడా బయటకు వచ్చేలా వుంది. అన్నీ మురికిగుంటలు దోమలమోత. మాకెవరు అడ్డు అన్నట్లు మోత పెడుతున్నాయి. ఆ దోమలు పందులు తమ యిష్టమొచ్చినట్లు పొర్లాడుతూ తోకలతో నీళ్ళు జిమ్ముతున్నాయి, ఈ దారిన రావడానికి మీలాంటి వాళ్ళకు హక్కు లేదన్నట్లు. ఆ పందులు! పందులేమిటి? పిల్లలు మాత్రం! వాటితో కేరింతలు కొడుతూ ఆడుతున్నారు. ఇక వాటిప్రక్కనేవున్న యిండ్లసంగతో! సూర్య చంద్రాదులు నాట్యమాడుతూవుంటారు ఆ కప్పు లేని పూరిగుడిశల్లో. వానొస్తే చెప్పేదేముంది? ఆ కొంపల్లోవుండే మనుషులసంగతివేరేచెప్పాలా అవే చెప్పుతున్నాయి వారి జీవిత విశేషాలను. అప్పుడే ఒక యువతి ఓ బిందె చంకనెట్టుకొని ఆ మురికి గుంటలో దిగింది. వళ్లంతా మచ్చలు స్ఫోటకపుమచ్చల్లావుంది. వయస్సుఎంతోవుండదు కాని నడుం వంగి ముసలిదానిలావుంది. నాకళ్ళను నేనే నమ్మలేక పోయాను. నిర్ఘాంతపోయి అలానే చూస్తూ నిల్చున్నా. కాని నన్ను నేను ఆపుకో లేకపోయాను.

“ఈనీళ్లు త్రాగుతారా!” అన్నానుఅకస్మాత్తుగా ఆ యువతి నావైపు అదోవిధంగాచూస్తూఅన్నది “త్రాగం. వాడుకొంటాము. మాకు పంపూ లేదు, బావీలేదు. ఎంతత్రవ్వినా నీళ్ళుపడవు. ఒకఫర్లాంగు దూరంలో పంపువుంది. అక్కడికెళ్ళి మంచినీళ్ళు తెచ్చుకుంటాము. తెల్లవారుజామున పోతే అంత పొద్దెక్కి వస్తాము. మరేమి చేయమంటారు?”

“ఐతే మీకు జబ్బులు రావూ?” అని ప్రశ్నించాను అమాయకంగా.

“జబ్బులా? జబ్బులు! కొత్తేముంది? రోజూ చస్తూనేవుంటారు మా పేటలో! ఎప్పుడూకలరా మశూచికం మామీద సవారి చేస్తూనేవుంటుంది. అయితే ఏం? ఎవరికావాలి? దేశానికేంలోటా? చస్తే జనాభా తగ్గుతుంది. దేశం బాగుపడుతుంది! అప్పుడు మిగిలినోరు సుఖ పడతారు.”

ఆమె మాటలు నా హృదయంలో శూలాల్లా గ్రుచ్చుకున్నాయి. ఆమెకు జవాబుకూడ యివ్వలేకపోయాను. అలానే నిరాశతో ముందుకు నడిచాను.

ఒక పాట వినపడుతుంది “లోకం తీరు తెలియగా నాపై కోపం నీ కెందుకోయ్” ఒక్కసారి పైకి చూశాను. ఇద్దరు స్త్రీలు నిజంగా అప్సరసలే. ఆ యింటినుంచి ఘుమాఘుమా వాసనకొడుతోంది. బహుశ తలనూనె కావచ్చు. కుర్చీలో కూర్చుని విరగబడి నవ్వుకుంటున్నారు. పాట వింటున్నారో లేదో మాత్రం తెలియదు. వెనుకటి ఆదృశ్యం కనుల ముందు గిర్రున తిరిగింది. ఒక వైపున మురికి గుంటలప్రక్కన ఆ కప్పులేని

గుడిశల్లో జబ్బుతో బాధపడే మానవులు. మరో పక్కన రంగురంగుల భవనాలలో, సుగంధాది లేపనాలతో సోఫాల్లో తీరిగ్గా కూర్చుకుని కిలా కిలా నవ్వే మనుషులు. ఒకవైపున మురికిగుంటల్లో పందులతో ఆడుకొనే అమాయిక బాలురు. ఒక వైపున రకరకాల రంగు బొమ్మలతో ఆకలనేది తెలియకుండా ఆడుకునే పిల్లలు. నాకు తెలియకుండానే నవ్వుమాత్రం వచ్చింది వెకిలిగా.

ఇంతలోనే మిన్నుముట్టే రోదన వినిపించింది. అకస్మాత్తుగా రెండడుగులు ముందుకు వేశాను. చుట్టూ జనం. రకరకాల మనస్తత్వాలుగల మనుషులు. కొద్ది గంటల్లోనే ప్రాణంబోయే ఆ అనాథ జీవి ఆక్రందనాలకు కన్నీరు కార్చేవారు ఆ గుంపులో బహు తక్కువ. బహుశా ఆ కన్నీరు కార్చేది అతనితో పాటు రేయింబగలు ఆ కార్ఖానాలో, ఆ పొగలో, ఆ సెగలో పనిచేసే కార్మికులేనేమో!

"వీళ్లకు ప్రాణం అంటే లెక్కవుండదు. నేను అనేక పర్యాయాలు 'నెత్తిన నోరు బెట్టుకొని మొత్తుకున్నా జాగ్రత్త జాగ్రత్త అని వింటేనా వాళ్ళ చెల్లాటలూ, వాళ్ళ సరసాలూ, నవ్వులూ, యికిలింపులూ, సకలింపులూ! ఒకటేమిటి పని చేస్తేగా!"

"ఏమాత్రమూ జాగ్రత్తలేకపోతే చావక ఏం అవుతారు?" అన్నాడు ఒకాయన కర్కశ స్వరంతో జనంవైపు చూస్తూ.

వెనుక ఎప్పుడో రాక్షసులు వుండేవారని, వాళ్లు మనుష్యుల్ని పీక్కు తినేవారని చెప్పుతూ వుంటారు పెద్దలు. ఇంతకంటె రాక్షసులు మరెవరుంటారు! ఒకవైపున ప్రాణం పోబోయే అతనికి సానుభూతి చూపడం అలావుంచి, పైపెచ్చు ఈసడింపులు.

ఆ కార్మికుని అంటిపెట్టుకొని ఎందరుజీవిస్తున్నారో! వాళ్ళ గతేమిటో ఆలోచించేవాడెవరు? మంచం చుట్టూ మూగివున్న ఆ జనసమూహంలో ఏ నలుగురో, ముగ్గురో మాత్రం కంటికి మంటికి ఏకధాటిగా కన్నీరు కారుస్తూ విలపిస్తున్నారు. బహుశా అతని భార్యా పిల్లలేమో! ఆ అనాథ బాలకులను చూస్తే ఎవరి హృదయం కరిగిపోకుండా వుంటుంది? ఏ పాషాణ హృదయమో తప్ప.

నా హృదయంలో తుఫానులా చెలరేగుతున్నాయి ఈ దృశ్యాలన్నీ. అక్కడ మాత్రం నిలవలేక చరచరా నడచివచ్చా. ఇలాంటి దృశ్యాలు నాకురోజూ కనుపించుతున్నాయేమో! కాని నాకేం వాటిని చూడటానికి? తింటానికి తిండి, కట్టబట్ట ఒకటేమిటి అన్నీ వున్నాయ్! అయితే ఈరోజున నన్నివన్నీ ఎందుకు వేధించుతున్నయ్? ఎవరో చచ్చిపోతేనో బాధ పడుతూంటేనో నేనెందుకు బాధపడాలి? అనినాలో నేను తర్కించుకో మొదలెట్టాను అలానే బజారులో ఒక ప్రక్కన కూర్చొని.

"మనమంతా మానవులం. అనేకమంది మహాత్ములుచెప్పిందిదే-ఒకరినొకరు ప్రేమించుకోవాలి, అప్పుడే శాంతిస్వాతంత్ర్యం, అభ్యుదయం, తిండి, బట్ట లభించేది"అనిమాత్రం రేడియో పలికింది.

దిగ్గునలేచి"అలాగేపోతున్నా"బాబూ! పైసా అంటూ కాళ్లమీద పడ్డాడు ఒకబాలుడు. నిండా పది సంవత్సరాలులేవు. అతన్నినిలువెల్లా చూస్తూ అలానే నిల్చున్నాను.

"మీదేవూరు అబ్బాయ్?" అన్నాను.

"నాకు తెలియదు. చిన్నప్పటినుంచి ఇలానే అడుక్కుంటున్నాను."

"అయితే తలిదండ్రులు వున్నారా?"

"ఉన్నారో లేదో నాకు తెలియదు."

"అయితే ఎక్కడుంటావు?"

"యిక్కడనే ఎక్కడో, ఏ చెట్టుకిందో; ఏ గుట్టకిందో."

"వీళ్ళకు డబ్బులు ఇవ్వకూడదు. అందితేజుట్టు లేకపోతే కాళ్ళు లంకించుకునేబాపతు. ఇదంతా జేబులుకొట్టే రకం"అంటూ చరచరా వెళ్లాడు ఒక పెద్దమనిషి.

అవును తప్పేముంది? మనకున్న కోరికలు వాళ్ళకుండవూ? పంచభక్షపరమాన్నాలతో మనం భోంచేస్తూవుంటే కనీసం పొట్టనిండా తినాలని వాళ్ళకుండదూ? మనం రోజూ సినిమా చూస్తూ వుంటే నెలకొక్కసారన్నా సినిమా చూడాలని వాళ్ళకుండదూ? రంగురంగులసిల్కుగుడ్డలు మనం ధరిస్తూవుంటే కనీసం తెల్లని గుడ్డలతో శరీరాన్నన్నా కాపాడుకోవాలనివాళ్ళకుండదూ. మనం ఒకళ్ళను పీడించితే పెద్దమనిషి తనమా? నన్ను

నేను ఆపుకోలేక ఏదో చేతికివచ్చింది మాత్రం యిచ్చాను.

"మిస్టర్ సతీష్? ఎక్కడినుంచి?"

ఎవరా అని చూచాను. ఆనాటి నాక్లాసు మేటు రమ. "ఓ మీరా ఇక్కడేం చేస్తున్నారు?"

"ఏముంది? ఉద్యోగం."

"అయితే బాగా సంపాయించుతున్నారన్న మాట?"

"ఆc. ఒకపూట పస్తుకు—చదివింది బి. ఏ. వచ్చేదియాభై. పైగా ఆఫీసరుచివాట్లు. పన్నెండు గాటులూ పని" అంది. "నాకంటే ఆ కూలివాడు నయం.

ఏదో అనబోయాను. ఇంతలోనే ఓ జట్కా ఆగింది నాముందు. నాన్నా! నాన్నా అని కేక అలా చూచాను. ఎవరో అని. శ్రీమతీ, మా బిడ్డడూ! కాని శ్రీమతిగారి ముఖం మాత్రం ఎర్ర వారి కందగడ్డలా అయిపోయింది. బహుశా ప్రయాణపు బడలికేమో అనుకున్నా. పలుకూ లేదు ఉలుకూ లేదు.

"వస్తాను రమా" అంటూ బండెక్కాను...

"ఏం అలా వున్నావేం?"

"ఏం? ఎలావున్నా బాగానేవున్నానే. ఐనా మీకెందుకు నే నెలావుంటే?" అని ముఖం పెద్దింత చేసింది.

ప్రయాణపు బడలిక మాత్రం కాదని యిప్పుడర్థమయింది. కాని మరేమిటో? అది మాత్రం వూహించుకో లేకపోయాను.

ఇంటికి చేరాక. "ఏమిటి? సరోజా! అలా అంటున్నావు?"

"ఏమన్నాను? నిజమే అన్నాను, కళ్ళారా చూసిందే అన్నా! ఆ అమ్మాయి ఎవరు?"

ఏం చెప్పాలో నా కర్థంకాలేదు. నే నేమీ మాట్లాడలేకపోయాను. నిర్ఘాంతపోయి అలా నే కుర్చీలో కూలబడ్డాను. కాని ఒక్క మాటమాత్రం అనకుండా వుండలేక పోయాను.

పరాయి స్త్రీతో అదీగాక నా స్నేహితురాలితో మాట్లాడినంత మాత్రాన యిలా వూహించుకుంటే మనం బాగుపడేదెలా? నాకు మాత్రం ఆ రేడియో మాటలే మాటిమాటికీ జ్ఞప్తి కొస్తున్నాయి...

కథానిక

# పూర్ణహృదయుడు

"శ్రీ విరించి"

గోడపక్కని నీడలో బండీ నిలుపుకుని ఆలోచనల్లో పడ్డాడు కొండయ్య. ఏమిటి ఆలోచిస్తాడు? గోకుల్‌రాం కంపెనీలో దణ్ణేలకు వేలాడే సిల్కుబట్టలూ రోజుకో కొత్త మోడల్ చిన్నకారు అమ్మే కంపెనీ అవరణలూ సకల సౌకర్యాలూ వుండి కాలుకదిపి రోడ్డుమీద పెట్టాల్సిన అవసరంలేని బంగాళాలూ గురించి కాదు. అవి తనకి సుతరామూ అక్కర్లేదని ఏనాడో తీర్మానించుకొన్నాడు. అవును. పాపిష్టి గొంతెమ్మ కోరికల జోలికి తనెందుకు పోవాలి? జీవితంలో ఒక్కసారిగా యేదో అయిపోదామని స్వర్గానికి నిచ్చెన్లువేసి చివరికి యేమీ అయిపోలేక బోర్ల బొక్కలాపడే బాపతు మనిషికాదు కొండయ్య.

రిక్షాలాగే కొండయ్యకు యింత పూర్ణతృప్తీ సహనమూ యెక్కడినించి వచ్చినాయి?— పొద్దునే లేస్తే మనుషులందరికీ బోలెడు పను లున్నట్టే తనకికూడా రిక్షాలాగటం! కోడి కుయ్యటంతోటే లేచి సద్దెన్నంతో కడుపు నింపుకుని బరబరా నాలుగుబేరాలు సాగించుకొనేసరికి పన్నెండవుతుంది. సూర్యుడు నడి నెత్తిమీదికి వస్తాడు. కాళ్ళకి చెప్పులున్నా తలకి దట్టంగా గుడ్డచుట్టినా ఉష్ణం భరించ శక్యం గాకండా వుంటుంది. ఇంటికొచ్చి మళ్ళీ తృప్తిగా భోజనంచేసి కమ్మటి కబుర్లు చెబుతుంటూంటే తియ్యటి కునుకు పడుతుంది. రెండుగంటలు దాటీ దాటడంతోటే మెళుకువ దానంత టదే వచ్చి మళ్ళీ బండి తయారు. బేరాలు సినిమాలకు